కథానిక:

అరకు లోయలో కూలిన శిఖరం

"బుచ్చిబాబు"

ఆ పచ్చటి పర్వతశిఖరాలు నీలిఆకాశాన్ని మేలిముసుగులా కప్పుతున్న తెల్లమేఘాన్ని అన్వేషించి, అందుకోలేక అలిసి, కిందికి క్రుంగి లోయగా సాగారి నగ్నంగా పవ్వళించిన ఏకాంత కన్యలు. విషాదంలో జుట్టు విరబోసుకున్నట్లు చుట్టూ దట్టమైన అడవి—పెన వేసుకున్న ముంగురులులా వికృతమైన చెట్ల మ్రానులు, విరిగిన మొదళ్ళు, వర్షపునీటికి చారలు తేలిన నల్లకొండరాతి బీటలు; ఆశకి భ్రమించి కళ్లు తెరిచినట్లు శిఖరాలమధ్య విడిన మబ్బునీడలు—శత్రూలమధ్య బాధతో జారిన కన్నీరుమాదిరి, వంకరలు తిరిగి అదృశ్యమయ్యే రోడ్డు, సగం ఎండిన పిల్లనదీ—తమ అందానికి సిగ్గుతో తలలువొంచి పాదాలకేసి చూసుకున్నట్లు, కిందికి, యింకా కిందికి, యింకా యింకా కిందికి, అధోలోకంలోకి దిగజారిపోతున్న ఆ దృశ్యం, ఆ అనుభవం, అరకులోయ.

సముద్రమట్టానికి రెండువేల అడుగుల ఎత్తునవున్న చల్లటి ప్రదేశం అరకులోయ. చుట్టూ పెద్ద కొండలు, అడివి, మధ్యగా ప్రవహించే పిల్లనది, సారవంతమైన నేల, సౌందర్యమైన ఆ దృశ్యాలు, విశాఖపట్నంనుండి మాచ్‌కండ్ జలవిద్యుత్ కేంద్రానికి వెళ్ళే యాత్రికులను ఆకర్షించాయి. ఇక్కడ వ్యవసాయం సాగించి, విద్యుత్ సహాయంతో ఒక మహాపట్టణాన్ని నిర్మించాలని పథకాలున్నాయి. మలేరియాని అరికట్టాలి; వసతు లేర్పాటుచెయ్యాలి; కాలవలు తవ్వాలి; ఇక్కడ స్థిరపడిపోడానికి సిద్ధపడ్డ వ్యక్తులు కావాలి; మాచ్‌కండ్‌నుండి విద్యుత్ యీ లోయకుండా నడిపి, వొక నాగరికత నెలకొల్పాలని ఎందరెందరో కలలుకంటున్నారు.

కాని కార్యానికి పూనుకున్నవారు లేరు; అది నిర్మానుష్యమైన అడవిప్రాంతం; కొద్దిమంది కొండజాతివారు అక్కడక్కడ కనబడి క్షణంలో మాయమవుతారు. సృష్టి ఆదిలో అల్లా వుండేదేమో ననిపిస్తుంది. చెట్లు, మనుషులు, కొండలు, మేఘాలు, మృగాలు—అన్నింటికీ ఒకే చైతన్యం. నాగరికతలో మరణించి, చరిత్రగతంలో జనించడంలాంటిది అరకులోయ సహవాసం.

అందుచేత ప్రస్తుతం అందరి దృష్టీ మాచ్‌కండ్‌పై మరలింది. మాచ్‌కండ్‌నది జలపాతంసహాయంతో పెద్ద జలవిద్యుత్ కేంద్రం నిర్మాణమవుతోంది. అది పూర్తి అయింతర్వాత అరుకులోయ వలస స్థాపన.

అది పూర్తిచేసే పనిమీద మాచ్‌కండ్ వెడుతున్న ఇంజనీర్ వర్మ, పట్టాపొందిన తర్వాత, వొకటి రెండేళ్లు ఇంజనీరింగ్ కాలేజిలో లెక్చరర్‌గా పనిచేసి, స్కాలర్‌షిప్‌మీద మేన్‌చెస్టర్‌లో పై చదువు పూర్తిచేసి పెద్ద డిగ్రీ పొంది రాగానే, మాచ్‌కండ్ నిర్మాణశాఖకి సలహాదారుగా నియమించారు. ఇదే అతను ప్రథమంగా మాచ్‌కండ్ రావడం. తను ముందుగా వెళ్ళి బంగాళా అదీ ఏర్పాట్లు చేసింతర్వాత, సామాన్లు, సిబ్బందితో ఆ మరుసటి దినం అతని భార్య రావడానికి ఏర్పాటుచేసుకొని ప్రయాణమై చక్కా వొచ్చాడు.

స్టేషన్‌లో దిగగానే ఆశాభంగమైంది. మాచ్‌కండ్ అధికారులు తనకోసం పంపుతామన్న వాగన్ పంపలేదు. గుమాస్తా సోమయ్యనిమాత్రం ఆహ్వానానికి స్టేషన్‌కి పంపారు.

సోమయ్య మాచ్‌కండ్ వుద్యోగైనా విశాఖపట్నం రవాణా బ్రాంచిలో పనిచేస్తున్నాడు. వాగన్ ఎందుకు రాలేదో అతనికి తెలీదు. దోవలో చెడిపోయిందేమో? వర్మగారి వుత్తరం వారికి సమయానికి చేరలేదేమో? తన పలుకుబడితో వొక జీప్ సంపాదించాడు. ఉదయం ఆరుగంటలకి కొండరోడ్ మార్గాన, నూట ముప్ఫైమైళ్ళ జీప్‌ప్రయాణం సాగించారు.

వర్మ ఇంగ్లండులో పైచదువు పూర్తిచేసిన వ్యక్తి అంటే నమ్మడానికి వీలుగా కనబడతాడు. డబుల్‌బ్రెస్ట్ కోటు, టై, ఆకుపచ్చ కళ్లజోడు, సిగరెట్ టిన్, లెదర్ కేస్—యీ వ్యక్తి పాపం జీప్‌లో ప్రయాణం చెయ్యాల్సివొచ్చింది, అనుకున్నాడు సోమయ్య వెనక సీట్లో. సాధారణ పంచకట్టు, ముతక చొక్కా, పైన కండువా, సోమయ్య వాలకంచూస్తే, చాలా అల్పుడైన వుద్యోగిలా వున్నాడు. అతనైనా, ఆహ్వానానికి మాచ్‌కండ్ అధికార్లు పంపవల్సింది! వెళ్లగానే అడగాలి. ఇంకానయం, భార్య స్నేహలత తనతో వొచ్చిందికాదు. ఇదంతా చూసి, ఏమనుకునో? నలుగురైదుగురు బంట్రోతులు, రెండు కార్లు, పెద్దపెద్ద వుద్యోగులు, రైలు దిగగానే సిద్ధంగా వుంటారని వర్మ వూహించుకున్నాడు. కాసేపు కోపగించుకున్నాడు—ప్రమాదకరమైన మలుపులు, జీప్‌ముందు ప్రాణంకోసం పరుగెడుతున్న కుందేలు, వింజామరలు వీస్తున్న చెట్ల కొమ్మలు, గార్డ్ ఆఫ్ ఆనర్ యిచ్చి సాల్యూట్‌చేసి నిలిచిపోయిన రాతిబండలు—వీటిని గమనించనే లేదు వర్మ.

మలుపులో సూర్యకిరణం, కత్తిలా పొడిచింది. చెట్ల ఆకుల్లనుంచి జారుతున్న మంచుకణాలు ఇంద్రధనస్సులా విరిగి, వెయింకత్తుల వెలుగుతో బద్ధకించిన చూపుని చీలుస్తున్నాయి. వర్మ కోపల

అరుకులోయ దృశ్యాలు పరిసరాల వర్ణనకోసం పేర్కొనబడ్డాయి. ఈకథలో వ్యక్తులు, వస్తువు కల్పితాలు. మాచ్‌కండ్ జలవిద్యుత్ కేంద్రంలో ఏవ్యక్తినిగురించి కాదు.

డింపించుకున్నారు. దేశానికి స్వతంత్రం వొచ్చింతర్వాత జరిగిన మార్పుకి అది చిహ్నం అనుకోకూడదు? వెనకటి, వొంగిసలాములు, జోహార్లు, బందోబస్తు, పటాటోపం తను ఆశించకూడదు. ప్రజలలో నూతన వికాసం, వ్యక్తిత్వం, స్వతంత్ర జిజ్ఞాస ప్రబలినాయి.

కొండదిగుతున్నారు. కింద ఆకుపచ్చ చీర కొంగువిప్పి పరున్న లోయ—పచ్చజొండులోంచి మరింత పచ్చగా కనబడుతోంది. ఎండకి కొండలు విరిగిపడ్డట్లు, అదృశ్యమౌతున్నాయి. ముందుకు పడిపోకుండా గట్టిగా పట్టుకున్నాడు. గుప్పున చెమట వాసనేసింది. డ్రైవర్ స్నానం చేసినట్లులేదు. కోటు విప్పాడు. టై వొదులు చేశాడు. జీపునిలిపి, సోమయ్యని ముందుకుపంపి, తను వెనకసీట్లో కూర్చున్నాడు. ఎనభైమైళ్ల ప్రయాణంతో వర్మ అలిసిపొయ్యాడు.

జీప్‌కూడా అలిసిపోయింది. కదలడంలేదు. ఏదో చెడింది. డ్రైవర్ రిపేరింగ్ సాగించాడు. అరకులోయలో యాత్రికుల బంగాళా యింకా ఆరుమైళ్ళుంది. మాచ్‌కండ్‌నుంచి ఏదేనా వేగన్ రావొచ్చు. మరో పాసింజర్ బస్ తగలొచ్చు; కాసేపు ఆ చెట్టుకింద విశ్రాంతి తీసుకుందాం అన్నాడు సోమయ్య.

వర్మ ఫ్లాస్కులో టీ కాస్త పోసుకుత్రాగాడు. సిగరెట్ ముట్టించాడు. చల్లగా గాలివీస్తున్నా అతని వొళ్లంతా వేడెక్కింది. చుట్టూ చూశాడు—అన్నీ గుట్టలు, పొదలు, పెనవేసుకున్న చెట్లు, ఆ రాళ్లమధ్య కింద, దూరంగా కొలను. బైనాకులర్స్ తీశాడు. అవును నీరే. ఎక్కడిదో? ఎక్కడినుంచి వుడుతుందో ఎవ్వరికీ తెలీదు—అవిధంగా అక్కడక్కడ జలం వూరుతుంటుంది, అదొక వింత, అన్నాడు సోమయ్య. వర్మ కిందికి రాళ్లల్లోకి దిగాడు. నీళ్లు స్వచ్ఛంగా వున్నాయి. అడుగు యిసికీ, నాచు, కనిపిస్తున్నాయి. దోసిలితో తీసుకొని మొహం తుడుచుగున్నాడు. మళ్లా ఆ పచ్చటి నీడలమధ్య జారుతున్న నీటిని చూశాడు. ఇంకా కింద, యిరవై అడుగుల దిగువున మరొక కొలను. చుట్టూ రాతిబండలు, సూర్యరశ్మిని బంధించే అల్లికపొదలు—ఝస్వంగా స్నానంచేస్తున్న వొక స్త్రీ బైనాకులర్స్‌లో కనిపించింది. తీక్షణంగా చూశాడు. నడుంకి కొాస్తంత ఎఱ్ఱబట్ట వుందేమో—బలంగా, స్ఫుటంగా యవ్వనం తీరికగా తీర్చిదిద్దిన ఆమె అవయవాలు అతని అస్తిపంజరాన్ని కదిల్చాయి.

"ఆ నీళ్లుమాత్రం త్రాగబోకండి" అని పైనుంచి సోమయ్య కేకవేశాడు. వర్మ ఎందుకో వులిక్కిపడి పైకి వొచ్చేశాడు.

"నీళ్లు మంచివికావంటారండి" అన్నాడు సోమయ్య. ఒక రాతిమీద దులుపుకొని, కారుసీటు తలకింద పెట్టుగుని వెన్ను వాల్చాడు వర్మ.

"ఈ ప్రాంతంలో మనుషులెవళ్లూ వుండరా?"

"ఉండకేమండి—కొండజాతివాళ్లు, మందులాళ్లు, అక్కడక్కడ మసులుతూనే వుంటారు. కొందరేమో మాచ్‌కండ్ పోయి కూలిచేసుకుంటారండి."

"ఇక్కడెవీ ఇళ్లు కనబడవేం?"

"వాళ్లకి యిళ్లెందుకండి—కొండగుహల్లోనూ, చెట్లకిందా తిరుగుతూ వుంటారండి" అన్నాడు సోమయ్య, ఆవులింతని అపుకుంటూ.

"మరి భుక్తి?"

"ఏదో పండించుకుంటారండి. వేటాడి మాంసం, తేనె తీయడం, మూలికలు అమ్మడం—అల్లాగే గడుపుకుంటారండి."

సోమయ్య ఆవులింతల్ని ఆపలేక పోతున్నాడు. తనూ జీప్‌లో కెళ్లి, కన్నుమూశాడు.

మళ్లా బైనాకులర్స్‌తో కిందికి చూశాడు వర్మ. స్నానం చేస్తున్న స్త్రీ లేదు. నాలుగుమూలలా చూశాడు. ఎక్కడా కనబ్లేదు. పాశ్చాత్య శిల్పకళలో తప్ప అతనెప్పుడూ అల్లాంటి శరీర సౌందర్యం చూడలేదు. మనవారి ఆచారాలు, బట్టకట్టు అలవాట్లు, సహజసౌందర్యాన్ని వికసించనీకుండా చేస్తాయని వర్మవూహ. పాశ్చాత్య స్త్రీల శరీరాలు కొంత మెరుగు. పొదల మధ్య, కాళ్లు నీళ్లలో మగ్గుపడి, పూర్తిగా కనబడని అవయవాలతో యిందాక తను చూసిన స్త్రీ, వీనస్‌డిమైలో శిల్పంలాగవుంది. ఛాయ, నూపూలు నలుపే; మొహం సరిగ్గా కనపడలేదు. కాని ఆ బలమైన అవయవాలు, స్థిరపడిన కండరములు, యుగయుగాల రాపిడికికూడా చెదరని రాతి చెక్కడాలకి మల్లె, దేనికీ లెక్కచెయ్యని ఆ రొమ్ములు—యిసుకలో తలదూర్చి, సృష్టిసౌందర్యం భరించలేక ఏడవాలనిపించే ఆ మూర్తి, వర్మని వొక సహజమైన పురుషుణ్ణిగా మార్చింది. ఏవేవో వింతభావాలు, విపరీతమైన పులకరింపు అతను స్పృశించలేని సత్యానికిమల్లే వ్యూహాలో బంధించబడాల్సిందే!

సోమయ్య, డ్రైవరు అటుపోతున్న ఎడ్లబండినినిలిపి, దానికి జీప్‌నికట్టి, మళ్లా ప్రయాణం సాగించారు. బంగళాకి చేరుకునేప్పటికి, వొంటిగంటైంది. వారికోసం మాచ్‌కండ్‌లో బైలుదేరిన వేగన్ అక్కడ నిలిచింది. ఇద్దరువ్యక్తులు మందహాసం చేశారు. ఒకాయన ముందుకొచ్చి నమస్కారంచేసి, వొకచీటి యిచ్చాడు వర్మకి. రెండోవ్యక్తి దూరంగా నిలబడే తల వంకించాడు. అతడు నమస్కారం చెయ్యనందుకు వర్మ విసుక్కున్నాడు. చీటీ చదువుతున్నాడు. వేగన్ ఎందుకు సకాలానికి పంపలేకపొయ్యారో తెలిపి మాచ్‌కండ్ బంగళా మెన్నాడుకాని ఖాళీ అవదుగనక, అంతవరకూ అరుకులోయ బంగళాలో వుండవల్సిందని అధికారులు కోరుతూ వ్రాసిపంపిన వుత్తరం అది. వర్మకి పూర్తిగా కోపమొచ్చేసింది. కాని ఎవరిమీద, ఎల్లా ప్రకటించాలో అతనికింకా తెలీడంలేదు.

"నాకు మీ వేగన్ అక్కర్లేదు—రేపుదయం స్టేషన్‌కెళ్ళి—సరిగ్గా పదింటికి అమ్మగార్ని, సామాన్లు తీసుకురండి—మీతో సోమయ్యకూడా వొస్తాడు. ఇక్కడేమన్నా భోజనం దొరుకుతుందా?" అన్నాడు వర్మ.

"కారియర్ తెచ్చామండి" అన్నాడు చీటితెచ్చిన వ్యక్తి, తమ్మయ్య.

సామాన్లు, వర్మ, బంగళాలో ప్రవేశించారు. దూరంగా వ్యవసాయశాఖవారి వొకటి రెండుయిళ్లు, టీ దుకాణంతప్ప, మనిషి

అలజడిలేదు. కోటు, జోళ్లువిప్పి, వర్మ భోజనానికని బల్లదగ్గరకొచ్చాడు. కారియర్ విప్పి, అన్నీ సిద్ధంచేసి వుంచారు. కాని కారియర్‌లో అన్నంమాత్రంలేదు. వర్మ నోట్లో మండిపోయింది. ఏమిటిదని గర్జించాడు.

“కోతులు ఎత్తికెళ్ళిన్నాయి కాబోసండి” అన్నాడు తమ్మయ్య చేతులు నలుపుకుంటూ.

“మీ ఏర్పాట్లు బాగున్నై. మాచ్‌కండ్‌లో పన్లు సాగడం లేదంటే ఆశ్చర్యమేముంది, మీబోటిగాళ్లందరూ వూరుకున్నప్పుడు.” ఆ వెటకారానికి, దూరంగా గేటుదగ్గర నిలబడ్డవ్యక్తి నవ్వాడు. అక్కడక్కడ చిరిగినలాల్చీ, నాలుగురోజులు కత్తి తగలని గడ్డం, ఖద్దరు పైజమా, చేతిలో రెండడుగులు పొడవుగల టెలిస్కోప్, దీనంగా, నిశ్చలంగాచూసే కళ్లు—అదీ అతని ఆకారం. నవ్వుకుంటూ వెళ్లాడు ఆ వ్యక్తి. వర్మ టీకోసం ఫ్లాస్కు బోర్లించాడు. బుట్టలోవున్న బ్రెడ్ తీసుకొని, కొయ్యకుండానే తినడం సాగించాడు. మాసినగడ్డంవ్యక్తి, అరగంటలో వోకుర్రాడినెత్తిన అరటిపళ్లు, వొక సోడాకాయలో నీళ్ళు, మరొక సోడాకాయలో టీ, పెట్టించి, తీసుకువొచ్చాడు. ఇవన్నీ వర్మకి అందచెయ్యమని తమ్మయ్యతో చెప్పి వెళ్ళిపోయ్యాడు.

అందరూ తలో వైపుకూ వెళ్ళారు. సోడాకుర్రాడు గంగడు తప్ప. వాడు మండువాలో పడుకున్నాడు. వర్మ పడుకుని లేచేటప్పుడికి మూడు గంటలు దాటింది. గంగణ్ణిలేపి నీళ్లు తీసుకురమ్మన్నాడు. మొహం కడుక్కుని, కొత్తబట్టలు వేసుకుని, గంగణ్ణి వెనకాలసీటులో కూర్చోమని, వర్మ జీప్ నడపడం సాగించాడు. టీ దుకాణంలో యిద్దరూ టీ త్రాగి ప్రయాణం సాగించారు.

“మాచ్‌కండ్ అటుగాదండి. ఇటండి. అది మీ రిందాకా వొచ్చిందేనండి” అన్నాడు గంగడు.

“నాకు తెలుసులేరా.”

నీ రుబికిన రాతిబండల దగ్గరకొచ్చారు పావుగంటలో.

జీప్ ఆపుచేసి, వర్మ రాళ్లమధ్య నీళ్ళల్లోకి దిగి చూశాడు. ఎవ్వరూ లేరు. కొండపైకి చూశాడు. ఒక కొమ్మను ఆనుకుని గడ్డం పెరిగి లాల్చీ వేసుకున్న వ్యక్తి టెలెస్కోప్‌లోంచి చూస్తున్న దృశ్యం కనబడింది. బైనాక్యులర్స్‌లోంచి జాగ్రత్తగా చూశాడు. ఆ వ్యక్తికి గడ్డంలేదు. క్షౌరం చేసుకున్నాడు కాబోలు. అతనే సందేహంలేదు. తనొచ్చిన పనిమీదే అతనూ వొచ్చాడా? అతనెవరు?

రోడ్డుమీదికొచ్చాడు వర్మ.

“అదుగో ఆ రాయిమీద కూర్చున్న మనిషెవర్రా?” అని అడిగాడు గంగణ్ణి.

“ఆరు సచ్చితానందంగారండి—మేస్త్రీ కాబోలు. ఇక్కడే తిరుగుతూంటాడండి, గొట్టంలోంచి చూస్తూ. అదుగో తమ్మయ్య, ఆయనకి తెలుసుద్దండి.” అని వారికేసి వొస్తున్న వ్యక్తిని చూపించాడు. ఆ వొచ్చిన వ్యక్తి, తనకి చీటి తెచ్చిన తమ్మయ్య. అతనొక మేస్త్రీ. నమస్కారం పెట్టాడు.

“మీకేమన్నా పండ్లు తెద్దామని బైలుదేరామండి. ఇక్కడ మంచి సపోటాలున్నాయి. అనాసకూడా వుంటాయంటారండి.” అని స్వగతంగా చెబుతున్నాడు.

“మిమ్మల్ని కుటుంబం, సామానుతో గనక వొస్తే యిక్కడ బంగళాలో యీ రాత్రి గడిపి, రేపు మాచ్‌కండ్ రమ్మన్నారండి. మీ రొక్కరే గనకనైతే యీ పూటే రమ్మన్నారండి—ఎక్కడో అక్కడ సర్దుకోవొచ్చునని. వెడదామాండి?”

“ఈ పూట యిక్కడే వుంటాను. రేపు అమ్మగారొచ్చింతర్వాత, అందరం కలిసే వెడదాం.” అన్నాడు వర్మ. జీప్‌లో ఎక్కమని సంజ్ఞ చేశాడు. తమ్మయ్య, ఎక్కాడు. లోయలో బంగళాకేసి పోతున్నారు.

“నీతో యిందాక వొచ్చిన మరో వ్యక్తి ఎవరు?” అని అడిగాడు.

“సచ్చితానందమని, మా గొప్ప తెలివైన మనిషండి. డిగ్రీ, చదువు లేదంట, పైపన్లు చూస్తూ మేస్త్రీగానే, జలపుట్ డామ్ కాడ వుంచారండి. మాప్‌లు గీస్తాడు; సర్వే చేస్తాడు; ఏవో కొత్త కొత్తవి కనుక్కుని, బలే చురుకుగా పని సాగిస్తాడండి. అక్కడ యింజనీర్లందరూ, యీనచేతే పన్లు చేయించుకుంటారండి...”

“అదిసరే—డిగ్రీ ఎందుకు లేదు?”

“నాకు బాగా తెలవదండి. కాలేజీలో కొంతకాలం చదివాడంట. మరి, ఏంతిరకాసొచ్చిందో, పరీక్షకెడతానికి లేకుండా కాలేజీలోంచి పంపంచి వేశారుటండి...” అన్నాడు తమ్మయ్య. ఈ మాట వినగానే, వర్మకి, యింతవరకూ బాధిస్తున్న సందేహం తీరింది. సచ్చితానందాన్ని కాలేజీలోంచి పంపించిన సంవత్సరమే అతను అక్కడ లెక్చరర్‌గా చేరాడు. వివరాలు జ్ఞాపకంలేవు. సచ్చితానందం, లేబరటరీలోంచి రెండువేలు ఖరీదైన టెలెస్కోప్‌ని తీసేసుకుని, పోయిందన్నాడన్న ఫిర్యాదుచేసి, డబ్బు కట్టమన్నారు అధికారులు. నేరమూ ఒప్పుకోలేదు. డబ్బూ కట్టలేదు. అందుచేత అతన్ని కాలేజీలోంచి పంపించి వేశారు. తరవాత ఏమయ్యాడో ఎవ్వరికీ తెలీదు. అతనికి తల్లిదండ్రులు లేరు. మేనమామ అతని వయనం అడుగుతూ, ఎక్కడేనా కనిపిస్తాడేమో అని వెదుకుతూండేవాడు. ఇంట్లోంచి పరారీ అయి యీ అడివిలో అవతరించాడన్నమాట! ఆనాడు దొంగిలించిన టెలిస్కోప్ అదే కాబోలు. ఈ విషయాలన్నీ తెలిస్తే, అతని మేస్త్రీ వుద్యోగం వుంటుందా? కాని దాచకుండా అందరిలోనూ చెప్పేశాడు, చిత్రం! నేరస్థుడి గర్వం, అహంభావం అట్లాంటివి కాబోలు! తనని గుర్తు పట్టాడా? తల పంకించాడుగాని, నమస్కారం చెయ్యలేదు.

ఎంత అహం?

బంగళా దగ్గర కొచ్చారు, నాలుగైంది. సూర్యుడు దూరాన కొండ కిందికి దిగుతున్నాడు.

“ఇక్కడేం చేస్తున్నాడింతకీ?” అని అడిగాడు వర్మ.

“అతను చేసేది వొకరకం పని కాదండీ. అట్లా సైకిల్ మీద తిరిగి ఏవో పరిశోధన చేస్తూంటాడండి.

ఇసిక, రాళ్లు, చెట్లు, శవ్వడం, కొలనదం—ఏదో ఒకటి. ప్రస్తుతం వొంటిన పిచ్చిలో పడ్డాడండి." అన్నాడు తమ్మయ్య.

"అంటే ?"

"అటుకేసి ఐదారుమైళ్లు వెడితే అతను కడుతున్న వొంటిన కనిపిస్తుందండి. అక్కడ వొక చిన్న నది వుందండి—పెద్దకాలవ అనుకోండి. వర్షాలుపడితే బాగా నీరుంటుందండి. లేకపోతే లేదు. కొండల్లోంచి జలపాతాలుగా పడుకుంటూ, తిరుక్కుంటూ ప్రవహిస్తుందండి. ఆ నది వొరిస్సావారికి సరిహద్దండి. అక్కడ వొంతిన పడేస్తే, అటు జనం యిటు, యిటు జనం అటు సులువుగా వెళ్ళి, రాకపోకలు బలిసి, ఐకమత్యంగా మారి జనం ఎగడతారంటాడండి. ఈ వొంతిన నిమయం ఎవర్కికీ పట్టదండి. తనే స్వయంగా వేస్తానని, చుట్టుపక్కల కొండజనాన్ని పోగుచేసి, పెద్ద చెట్లు కొట్టించి, వొంతిన మొదలుపెట్టాడండి...."

"పదండి, చూద్దాం" అన్నాడు వర్మ, జీప్ ముందుకి నడుపుతూ. ఐదారుమైళ్ల తర్వాత నది కనిపించింది. వొంతిన యింకా ఎగువున గుట్టలవెనక వుంది. అక్కడికి జీప్ వెళ్లదు. నడిచి వెళ్లాల్సిందే. మూడు ఫర్లాంగులు నడిచారు. వర్మకి ఆయాసంగావుంది; ఆకలేస్తోంది; దిగువున నది కనిపిస్తోంది; కాసేపు విశ్రాంతి తీసుకుందామని కూర్చున్నాడు. రాత్రి భోజనం ఏర్పాటు చెయ్యడానికి తమ్మయ్య వెడతానని సెలవుతీసుకు వెళ్లాడు. గంగణ్ణి, వెనక్కి బంగళాదగ్గర దుకాణానికెళ్ళి, టీ తీసుకురమ్మని పంపించాడు.

వర్మ మరో పదడుగులు దిగింతర్వాత వొంగిచూస్తే, నీళ్లల్లో వొక స్త్రీ స్నానం చేస్తున్న దృశ్యం చూశాడు. బైనాకులర్స్‌లోంచి చూశాడు. తాను మధ్యాహ్నం చూసిన స్త్రీయే. దగ్గరగా వుండటం మూలాన, బాగా స్ఫుటంగా కనిపిస్తోంది. నడుంలోతు నీళ్ళ—కాసేపు యీది, మళ్లా రాతిబండమీద కూర్చుంటోంది. చేతులకి ఎర్రగాజులు తప్ప, శరీరంమీద ఏ వొస్తువూ లేదు. కిందికి మెల్లగా దిగాడు. వొడ్డుకి చేరుకున్నాడు. ఆమె వెనక భాగం కనిపించింది. నడుంకి ఎర్ర లంగా బిగించివుంది. ఇంకేమీ లేదు. లండన్ ఆర్టుగేలరీలలో చూసిన పోతవిగ్రహాలు స్మరణకొచ్చాయి. వయస్సు పాతికేళ్లలోపు. పరిపూర్ణంగా వికాసంపొందిన యవ్వనం, నిర్మలమైన చర్మం, ఆ వొంపులు, వొయ్యారం, కుందాతనం అతన్ని ముగ్ధుణ్ణిచేశాయి. అదొక రాతివిగ్రహం అవుతే, ఆ వక్షంపై తల పగలకొట్టుకోవాలనిపిస్తుంది. వెనక్కి తిరిగింది. భయంతో వదేవసే కళ్లు చిట్లించింది. మూసుగున్నా తెరుచుకున్నట్లు కనబడే, పెద్ద కళ్లు. స్పృషి స్పృశించని యవ్వనం కళ్ళల్లో, పళ్లవరసలో మెరిస్తోంది. గోధుమరంగు జుట్టు, ఎండిన తుమ్మచెట్ల ఆకులు పెనవేసుకున్నట్లు, సుడుటని బిగించి, చిక్కుపడి గుబురుగా లేచింది. రెండు చేతులతో రొమ్ము కప్పుగుని బండమీద కూర్చుంది.

వర్మ మాట్లాడాడు, ఆ అమ్మాయికి అర్థంకాలేదు. చెవిటిగాదు; లోతుందా? అటుగున బురదా, యిసికా? వణేస్తోందా? సమాధానం లేదు. నవ్వుతోంది. ఏవో ధ్వనులు చేస్తోంది. చేతులు తిప్పుతోంది. నిండైన వక్షం, బలంతో పైకి నిట్టూర్పువచ్చినట్లా,

తేలిపడుతోంది—సంధ్యాసూర్యకాంతిలో లేచిన పద్మవనంలో కొలనిటా నిలిచి మళ్లీ. కొంగొందల మధ్య లోయలాంటి. అద్భుత సుగుణాని ఆలించి, కన్నుమూస్తే, కాంతి పోకుండుడు.

తెలుగు, ఇంగ్లీషు, హిందీ - అన్నీ ఉపయోగించాడు. అర్థం కాలేదు. తను నగ్నంగా వున్నా అతన్ని దగ్గరికి సంజ్ఞచేసింది. అతను ఆమెకేసి తీక్షణంగా చూడలేక పోతున్నాడు. ఏ అవయవం మొదటిదంత? నడుమా, మెడా, జుట్టా, అలలుగా కొడిపెన నీళ్ళలోంచి ప్రతిబింబించి కనబడీ కనబడని వక్షమా? నీటిలో సూర్యకాంతి మెరుపొచ్చి వెలిగించి, కళ్లన్ని కలవరపెట్టిన వన్నెసిరనా? పెదవులు ఎర్రగా మారుకున్నప్పుడు, చెక్కిటిమీద మిగిలిపోయి, కళ్లలో దాక్కుని రహస్యంగా పిలుస్తున్న చిరునవ్వునా?

రమ్మంటోంది. ఆ ధైర్యానికి వర్మ చకితుడయ్యాడు. అతని కేతరాదు. నీళ్ళంటే భయం. అయినా, స్నానం చెయ్యాలనుంది. చొక్కా తీశాడు. బనీనుంది. పువ్వులు లంగోటీలాకట్టి నీళ్లలోకి దిగాడు. వేలుతో చూపించి నీ పేరేమిటన్నాడు. మూనా అంది. మోనాదో, మూనాదో, మున్నాదో అతనికి తెలవలేదు. 'మ' 'న' రెండక్షరాలు గల ధ్వని ఆ పేరు. లియొనార్డోడవిన్సీ గీసిన మోనాలీసా చిత్రపటం జ్ఞాపకానికొచ్చింది. ఆ పటం, పారిస్ లూవ్రేలో వుంది. అది 1504 లో గీయబడింది. ఆ పటాన్ని 'ఫ్రాన్సిస్కో డి గయోకొండ' భార్య 'లీసా'ను చూసి వ్రాశాడు. వర్మ ఆ చిత్రం నకలుని ఇంగ్లండ్‌లో కొన్నాడు. ఈ దృశ్యం అట్లాంటిదే. వెనకాల, రాళ్లు, కొండలు - యుగయుగాలుగా నిలిచిన కొండల ప్రాచీన బలం, స్థిరత్వం ఆమె శరీరానికి అమరత్వాన్ని ఆపాదించినట్లు - ఆమె ప్రకృతిలో ఒక సజీవభాగం. చలనంలేని ఆ సౌందర్యాన్ని మనిషి దూరంగా ఆరాధించగలడు గాని తాకలేడు. స్వచ్ఛమైన కళతో పరిచయం పెరిగినకొద్దీ, యథార్థ సంఘటన కళారూపాన్ని పొంది, స్వప్నంలాగ, స్పృశించలేనిదవుతుంది. కలని కెలికితే, కోటి తుంపరలుగా కదిలి కృశించి, తుంగి, వార్ధక్యంలో, మృత్యువులో మిళితమై, మరి కనబడదు. కాని శరీరం వున్నంతసేపూ తాకక తప్పదు. జీవిత రంగంలో యీ పెనుగులాట తథ్యం. యథార్థ సౌందర్యాన్ని చూసి కలగంటాడా? కలలో చూసిన సౌందర్యాన్ని యథార్థ జీవితంలో చూసి తనది చేసుకుంటాడా? జీవితంపై ప్రభావంలేని కళకి ప్రయోజనం లేదు. ఆమె చెయ్యిపట్టుకుని రెండడుగులు వేశాడు. ఆమె దూరంగా లోతుకి వెళ్ళింది. సంధ్యలో వెలిగిన నీళ్ళకాంతి, వక్షంమీద పడి, మృదువైన చర్మంవెనుక రక్తాన్ని వెలిగించింది. అతను ముందుకు పడిపోయ్యాడు. చేతులు ఆమె మెడచుట్టూ పడ్డాయి. ముందుకు తోసేసింది. వెనక్కి పడ్డాడు. బండమీద కూర్చున్నాడు ఆమెకేసి చూస్తూ. వెనక్కి తిరిగింది. వేళ్ళతో నీళ్లు చిమ్ముతోంది. వొంగిన చెట్ల చిటారుకొమ్మల ఆకులు సంధ్య వెలుగులో ఎర్రగా మెరుస్తూ, నీళ్ళల్లోపడ్డ నీడలు పచ్చగా, ఎర్రగా ఆమె శరీరాన్ని వెలిగిస్తున్నాయి. అది మరపురాని సౌందర్యానుభవం. సంధ్యని, వెన్నెలని, కొండ శిఖరాన్ని చూసి ఆనందించినట్లు, చూసి పొందిన ఆనందంతో తృప్తిపడకూడదు? సౌందర్యం మానవుణ్ణి రోగిగా చేస్తుంది కాని తనలో మానవత్వమే,

మళ్లా మనిషిగా మార్చివేస్తుంది. ఏదో శక్తి, స్వప్నంలో మెదిలిన కోరిక, శరీరంలో ప్రజ్వరిల్లి అతన్ని ప్రాచీన ప్రాణిగా ముందుకు నెట్టి, తపస్సు నుండి కౌర్యానికి రగిల్చింది. కౌర్యం తపస్సు నాశన హేతువు. యవ్వనం నశింపుకి, ప్రాణి చావుకీ, యీ ప్రాకులాట, ఈ ఉబలాటం, తనదిగా వుంచుకోవాలన్న ఈ వాంఛ కారణాలు కాబోలు అనుకుంటూ ఆయాసం తీర్చుకుంటున్నాడు.

వర్మ నిలబడలేక పోతున్నాడు. నీళ్ళల్లో కూర్చుని ఆమె కాళ్లో పడిపొయ్యాడు. చలిలో, అడివి కాలినట్లు, కొండ బద్దలై నిప్పు వ్యాపించినట్లు ఆమె శరీరం అతనిచేతుల్లో, బుగ్గలమీద కాలింది. శరీరం కరిగినట్లు, ముద్దగా కాలినట్లు, నరాలు దోవ తెలీని రక్తంలో తన్నుకులాడుతున్నాయి. గడ్డంకింద చెయ్యి పెట్టి ఒక్క తోపు తోసి వొడ్డుకి వెళ్ళింది మూనా. పొద వెనక వుంచిన తెల్లగుడ్డ తెచ్చి, మొహం తుడుచుకుని, వక్షంమీద కప్పుకుంది. తడికి రొమ్ములమీద వస్త్రం బిగిసింది-కూర్చుని లంగా నీళ్లు పిండు తోంది. అతనూ వొచ్చేశాడు. బనీను ఆరబెట్టుకుంటున్నాడు. ఒక్క సారి ఆకాశం నల్ల మేఘాలతో చీకటైంది. చివరి సూర్యకిరణాలు విరిగిన కత్తులలా మేఘాలవెనక అదృశ్యమైనాయి. దట్టంగా నలుపుని పూరించుకుంటూ, శిఖరాల్ని తన్నుకుంటూ, మేఘాలు విజృంభించి ఆకసమంతా వ్యాపిస్తున్నాయి:

మేఘాలకేసి చూపించింది మూనా. ఇద్దరూ చరచరా నడిచి పోతున్నారు. వెనక మేఘాలు, సుడిగాలి, వూడిన ఆకులు, విరిగిన కొమ్మలు, తాకిడికి జారుతున్న పిల్లరాళ్ళ ప్రవాహం, అడివి కీట కాల కోలాహలం, మూనా శరీరంలోని వింతవాసన సుడిగుండంలా అతన్ని ముంచివేస్తున్నాయి. నడవలేక పోతున్నాడు. అతని చెయ్యి పుచ్చుకుని, పైకి లాక్కుని పోతోంది. మూడు పెద్ద రాళ్లమధ్య ఒక గుహాలోకి చేరుకున్నారు. వర్మ ఆయాసం తీర్చుకుంటున్నాడు. కిందికి చూశాడు. నదీప్రవాహం కనబడింది. కాళ్లు తేలిపోతు న్నాయి. అతనికి భయం సాక్షాత్కరించినట్లుగా వుంది. పాపం చేసినవాళ్లు ఎత్తునుండి కిందికి చూడలేరని ఏదో మానసిక శాస్త్ర పుస్తకంలో చదివాడు. కిందికి చూడలేని భయం అతన్ని అల్పుణ్ని చేసింది. గాలికి పడిపోకుండా వుంచేటందుకన్నట్లు ఆమె మెడ గట్టిగా పట్టుకున్నాడు. అతని నొసటిమీద వున్న తేనెపట్టులో వేళ్లు పెట్టింది మూనా. కంతలలోకెలికి రాణి యీగను లాగింది. మిగత తేనెటీగలన్నీ జొయ్యిమంటూ సుడిగాలిలా బైటపడి అతన్ని ఆవ రించి, కవ్వించి కుట్టేస్తున్నాయి. వర్మ పరుగులు సాగించాడు. అతన్ని పొగాలా చుట్టాయి తేనెటీగలు. మూనా నవ్వుతూ వెనకాల వొస్తోంది. అతని జేబులోంచి అగ్గిపెట్టె తీసింది. చిదుగులతో మంట చేసింది. పొగని తన నోట్లోకి తీసుకుని వాటిమీద వూదింది. వేళ్ళల్లో పట్టిన రాణి యీగను వాటిముందు ప్రదర్శించింది. దూరంగా తీసు కెళ్ళి కంతలో రాణి యీగను దాచింది. మిగతా యీగలన్నీ వర్మని విడిచి, దానిచుట్టూ కంతలోకి పోతాయి.

మూనా తొందరగా నడవమని సంజ్ఞ చేసింది. ఏదో పాట ధ్వనించింది. జీప్ కనబడటంలేదు. అతనికి దోవ తెలీటంలేదు. ఏదో తోవని ఎక్కడికో అడివిలోకి వొచ్చేశారు. అన్నీ పెద్దపెద్దరాళ్ళు, జుట్టు విరబోసుకుని, దయ్యాలకి మల్లే నల్లమ్రాను చెట్లు, గాలిలో దగ్గరగా జరిగి భేతాళ నృత్యం సాగించాయి. ఆకాశంలో పిడుగులు ప్రతిధ్వనిస్తున్నాయి. రాళ్లు బద్దలైనట్లు, శిఖరాలు కూలినట్లు, మెరు పులు వొక్కసారిగా దట్టమైన చీకటిని చీలుస్తున్నాయి. ప్రకృతి గాయపడి, రక్తం కాలువలుగా ప్రవహిస్తున్నట్లు, మెరుపులు, వురు ములు, వాళ్ళని తరుముతున్నాయి. ఇంక అతను నడవలేడు. మరో గుహా, మరో మెరుపు, వురుము-అక్కడే వాలిపొయ్యాడు. ఆమె భుజంమీద తెల్లగుడ్డ తీసి అతని తలని కప్పింది.

క్షణంలో వర్షం ప్రారంభమైంది. రాతిబండలమధ్య వాళ్లున్న స్థలం కొస్తంత పొడిగావుంది. బీటలలోంచి, వర్షం ధారలాపడు తోంది—దిక్కు తెలీకుండా ఆకాశంలో నిర్మాణమైన మల్లికరాతి గారంలోంచి పడినట్లు నలుదిక్కులా దుయ్యపడుతోంది. అతని తువ్వాలు, ఆమెపైబట్ట రెండుపైపులా బీటలలో బిగించి కట్టింది. అతనిచేతులు, కాళ్లు అరచేతులతో వేడికోసం రాస్తోంది. వర్షం లోపలికొచ్చి పడుతోంది. ఆమె మూలకి జరుగుతోంది. అతను ఆమెకేసి జరుగుతున్నాడు. అతని తల ఆమెవొడిలోపడి, చేతులతో ఆమెమెడని పెనవేసుకుని, దగ్గరగా వేడినికాంక్షిస్తూ, యింకాదగ్గ రగా వొస్తున్నాడు. ఆమె మోకాళ్ళమీద కూర్చుని గోడని ఆనింది. అతను గోడకి అదిమి, పైకి ఎగబాకుతున్నాడు. వేళ్లు ఆమె పెదవులను వెదుకుతున్నాయి. ఒకచెయ్యి అతని గొంతుపైన వేసి, రెండోచేతితో గోడని ఆనుకొని వొక్కసారి పైకిలేచి నిల బడింది మూనా. అతనికల తటాలున కింద రాతిమీదపడింది. 'అమ్మో' అన్నాడు. చిన్నగాయం తగిలింది. రక్తం చురుకుగా కారి వర్షంనీటిని ఎర్రగా మార్చింది.

వర్షం నిలిచింది. అతని తలకింద గుడ్డలుపెట్టింది. గాయాన్ని కడిగింది. లేచి బైటకువెళ్లింది. పదినిమిషాల్లో వర్మ బైటకు వొచ్చాడు, గాయం తడిమిచూసుకున్నాడు. అంతా కారు చీకటి. జేబులో అగ్గిపెట్టె తడిసి వెలగడంలేదు. సిగరెట్టు కాల్చాలని వుంది—అవి తడిసి విడిపొయ్యాయి. దోవ తెలీడంలేదు. ఎటోపోతు న్నాడు. మూనా ఏవో ఆకులు వేసుకుంటూ వొచ్చింది. చెయ్యి పట్టుకుని నడిపించుకుంటూ తీసుకెడుతోంది. అక్కడంతా చదు నుగావుంది. ఒక బండమీదకూర్చుని, అతనితల తొడమీద ఆనించి, తెచ్చిన ఆకులుపిండి రసం గాయానికిరాసి, ఆకులుపైనవుంచి గుడ్డ చించి కట్టుకట్టింది.

జీప్ నిలిచినచోటు దగ్గరలో కేవుంది. గంగడు ఆకలేసు కుంటూ వొచ్చాడు. ఇద్దరూ అతన్ని జీప్‌లోకి చేరవేశారు. అతను డ్రైవ్‌చేసేస్థితిలో లేడు. గంగడు తడిసి, చలికి వొణికిపోతున్నాడు. మూనా, పావుగంటలో ముగ్గురుమనుషుల్ని తీసుకొచ్చింది. వారు జీప్ లాగుతూ, తోసుకుంటూ, వెళుతున్నారు. ఆమె తనగుడిసెకి వెళ్లింది.

ఈ అత్యుద్రేకంలో దేంతోవతుకు? నేరెవరు? నిజాన్ని తెలిపే విలువలు లేవు. అబద్ధానికి వయస్సులేదు. నియమాలు, ఆచారాలు, పాపపుణ్యాలు, రాళ్ళుగా, శిల్పాలుగా, సరుకులుగా, చిరస్థాయిగా మారిపోయాయి. వాటికి వయస్సులేదు; పరిణామంలేదు. అందులో వొకడైపోయాడు సచ్చిదానందం—మానాతో కలిసి. నగ్నంగా ఏడమ్, ఈవ్ లకిమల్లె. ఫలాలు, ఆకులుతింటూ, తేనె త్రాగుతూ, నదిలో ఆడుకుంటూ, చల్లటి నీడలమధ్య, గడ్డిలో ఆమె గుండెపై చెవిని ఆనించి, విశ్వం పరిభ్రమిస్తున్న నాదాన్ని, లయని వింటూ, ఆలోచనని ఆమె మెడలో పాతేసి, ఊహని ఆమె నడుంచుట్టూ తన చేతులతో కట్టేసి, ఋతువులలో మారుతున్న తృష్ణని ఆమె కను రెప్పలవెనక ముద్దులతో మాతపజేసి, ఆనందంతో భాషని చెప్పుకుంటూ బైటపడిన నాలుకని, ఆమె అధరంవెనక హత్యచేసి, నిశ్శబ్దంగా కాలాన్ని కామంతో బంధించి, వారి వునికే లోకానికి తెలీకుండా అనంతంలో లీనమైన ఆ వ్యక్తుల జీవితం వర్మకు కావాలి. కాని, సాహసంలేదు; ఆ త్యాగం చెయ్యలేడు.

సంఘాన్ని విడిచిపెట్టి యేకాంతంలోకి పారిపోయినవారు, నిజంగా అక్కడ ఆనందంపొంది, తృప్తిపడతారని విశ్వసించడం కష్టం. మరో పదిమంది నగ్నదంపతులు అరకులోయలో నివాసం యేర్పరుచుకుంటే, మళ్లా అదొక చిన్న సమాజంగా తయారవుతుంది. అక్కడ స్పర్థలు, అసూయలు, ద్వేషాలు, పగలు, రాజకీయాలు. అదొక తాత్కాలికానుభవంకాని జీవిత పరమావధి కాకూడదు. వీళ్లందరూ, ధైర్యం, త్యాగం అనుకుంటున్నది నిజానికి, పిరికితనమూ, అసహాయతానూ.

తనకాధైర్యం లేదన్న చైతన్యం వర్మని కార్యానికి పురిగొల్పింది. రెండైంది. స్నేహలత, సామాన్యా సాయంత్రం ఐదు, ఆరుగంటలకికాని రారు. వొచ్చినా, రాత్రి యిక్కడేవుండి, మొర్నాడు వెళ్ళడానికి నిశ్చయించుకున్నాడు. భార్యని తనతోటే తీసుకురానందుకు తన్నుతాను అభినందించుకున్నాడు. స్నేహలత మూర్తి ఊహలో మెదుల్తోంది. ఆమె సన్నంగా, నాజూకుగా, లతలా వుండి, తనని అల్లుకుంది. స్త్రీ అంటే, "వొక ఎముక, పిడికెడు జుట్టు, గుడ్డపీలిక"—అని బర్న్స్‌కవి వర్ణన జ్ఞాపకానికొచ్చి నవ్వుకున్నాడు. అతని అరిచేతికింద గట్టిగా తగిలిన ఆమె బుజాల ఎముకలు స్మరణకొచ్చాయి.

గ్రహణంనాడు ఆమెతో సముద్రస్నానానికి వెళ్లిన ఘట్టం అతను మరిచిపోడు. నీళ్ళలోకి దిగగానే ఆ పల్చటి ఆకుపచ్చ చీర ఆమె తడిసిన శరీరాన్ని జకించివేసి, అల్పమైన అవయవాల్ని ప్రదర్శించింది. నీటికి లంగ చుట్టుకుని, జుట్టంతా పిడికిటిలో అమరేటట్లుగా వుంది. నీటి బిందువులు బుజాల ఎముకవల్ల ఏర్పడిన వొంపులో నిలిచిపోయాయి. జూలు కత్తిరించిన గుఱ్ఱంలా, రెక్కలూడిన పక్షిలా, ఎండిన కొలనులా—ఎల్లాగో ఐపోయింది. నడుంలోతు నీళ్లే—పెద్ద కెరటం అతన్ని లోపలికి గెంటింది. చెయ్యి పైకెత్తి పట్టుకోమని సంజ్ఞలు చేస్తున్నాడు. ఆమె గమనించలేదు. తను యిసకలోకి వెళ్లింది, కూసం విడిచిన పాములా. మరో కెరటం ముందుకు తోసింది. తనూ బైటపడ్డాడు. చీకట్లో అర్ధరాత్రి, 'ఫిఫ్త్ ఎవెన్యూ' పరిమళంలో, వారు చేసుకున్న ప్రేమ ప్రమాణాల విలువ ఎంతటిదో అతనికి తెలిసొచ్చింది. అతనికి నీళ్ళంటే ఎంత భయమో, ఆమెతో నిజం చెప్పడంకూడా అంత భయం. ఆ రాత్రికూడా సిగరెట్ పొగ వొదుల్తూ, మళ్ళా ప్రమాణాలు. తెచ్చిపెట్టుకున్న ఉద్రేకంలోని పల్చటి కన్నీరు—అంతా అందమైన భ్రమ! మాయైంది. అప్రయత్నంగా జీపువద్దకు నడిచి వెళ్ళాడు. లోపలికి ఎక్కాడు. అతని వూహాలో వెన్నెల నక్షత్రాలు కదుల్తున్నాయి—నక్షత్రాలకేసి టెలిస్కోపులోంచి చూస్తూన్న సచ్చిదానందం. సాటర్న్ గ్రహం చుట్టూవున్న 'రింగ్స్' ఆ టెలెస్కోపులో కనిపిస్తాయి. దిగ్భ్రమగొల్పే ఆ వింత దృశ్యాన్ని 'మానా'ని చూడమంటాడు. జ్యుపిటర్ గ్రహంచుట్టూ తిరిగే చిన్నగ్రహాల నీడలు, అందులోంచి కనిపిస్తాయి. విశ్వం నీలి పమిటలో దాచుకున్న వింతలన్నిటినీ చూస్తాడతను. చూసిసాధించే దేమిటి? వొంతెన కట్టడానికి, ఖగోళ శాస్త్రానికీ ఏ సంబంధమూ లేదు. కాని ఎందుకు అట్లా చూడటం? చెట్టుకొమ్మమీద కూర్చుని, సంధ్యవేళ పశ్చిమ ఆకాశంకేసి చూస్తూ కూర్చున్న సచ్చిదానందం అతని బుజంమీద తల ఆనించి నగ్నంగా కూర్చుని వీనస్ కేసి చూస్తున్న 'మానా'—అరకులోయలో వొకదానిచుట్టూ వొకటి తిరుగుతూవుంటే, గోళాలు—'టెలిస్కోపిక్ బైనరీస్'—టెలిస్కోప్‌లోంచి తప్ప కనుపించవు. అతని ఊహ టెలిస్కోప్‌లా ఆ దృశ్యాల రహస్యాన్ని బైటపెడుతోంది. పాత పత్రికలో ఆ నెలలో ఆకాశంతీరువును వర్ణించే పటాలు, వ్యాసం చూశాడు. అతనికేమీ బోధపడలేదు. వీనస్ పశ్చిమ ఆకాశంలో, సూర్యాస్తమయం అవగానే, ఎక్కువ కాంతివంతంగా మెరిసి, అరగంటలో మాయమవుతుందట.

జీప్ నడుస్తోంది. అతనెక్కడికి వెడుతున్నాడు? జీప్‌లో ఆకాశంలోకి ఎగిరి, కొన్నికోట్ల సంవత్సరాలు అనంతంలో తిరిగితే చివరికి యిదేస్థానానికి చేరుకుంటాడు. విశ్వం అనంతంకాదుట. దానికి పరిమితి వుందట. స్థలం—తనవైపుకే వొంకర తిరిగివుందట. తను ఎక్కడికీ వెళ్ళలేడు. తిరిగి యిక్కడికే రావాలి!

ఎక్కడికొచ్చాడు తను?

వొంతెన సమీపంలో కొచ్చాడు. జీప్ నిల్చిపోయింది. దిగువున లోయలో నది వడిగా ప్రవహిస్తోంది. నీటివడికి వొంతెన తెగలేదు. ఆ వొంతెన ప్రయోజనం ఏమిటి? ఎవరి అవసరాలకు వారు, తలో వొంతెన స్వయంగా వేసుకుంటే, ప్రభుత్వం ఎందుకు? పథకా లెందుకు? 'మానా' ఒరియాపిల్ల—ఆ వొంతెన కడ్తే, ఒరిస్సాప్రాంతం పనివాళ్ళంతా యిటొచ్చి, పనులు సంపాదించుకుంటారు. మానా బంధుకోటికి పనికల్పించడం తప్ప వేరే ప్రయోజనం ఏముంది? దానివల్ల నష్టంకూడా వుంది. ఇటువారు అటు, అటువారు యిటూ వెళ్ళి కలన తేర్పరుచుకుంటారు. దానితో తగాదాలు బైలుదేరుతాయి. అంతేకాదు. వొక్కసారిగా దానిమీద నో యాభైమంది నడిచారో, అది కూలి అంతా నీటిపాలవుతారు; ప్రాణనష్టం కలుగుతుంది.

వొంతెన చేతులలో, కొంతమందికి వొస్తేరాదు వర్మ.

కొంచెం దూరంలో మరో ఎత్తుకొండ వుంది. దాని శిఖరానికి తిన్నగా దిగువున వొంతెన వుంది. అతని కొక భావం స్ఫురించింది. గబగబ ఆ కొండమీదికి వెళ్ళాడు. నాలుగైంది—నలువైపులా చూశాడు. ఎవ్వరూ జనం లేరు. కొండమీద పెద్ద పెద్ద బండలు వొరిగి, కదిపితే జారే కోణాలమీద నిలబడి వున్నాయి. ఏడెనిమిది పెద్దవి, చిన్నవి కనిపించాయి. ఒకదాన్ని కదిపి చూశాడు. చాలా పెద్దది. అది కదల్లేదు. దాని ముందుగా కొంచెం ఎత్తున నాలుగైదు చిన్న బండ లున్నాయి.

ఇంగ్లీషు సినిమాలలో దృశ్యాలు జ్ఞప్తికొచ్చాయి. నాజూకు, నాగరికత,—సహజమైన శక్తుల్ని, 'కసిని' వుద్రేకాన్ని మరుగు పరుస్తున్నాయి. కాని ఆ ప్రచండశక్తులు ఎప్పుడో వొకప్పుడు బైట పడక మానవు. అస లందుకే యుద్ధాలు. ప్రజలలో దాగిన 'తృష్ణ' 'కసి' 'పగ' 'పోటీపడటం'—మొదలైన ఆదిమానవుల వుద్రేకాలు బైటపడేటందుకే, కుస్తీపట్లు, 'బాక్సింగ్' మొదలైన వినోదాలు పాశ్చాత్యదేశాలలో ప్రబలాయి. టార్జాన్ చిత్రాలంటే అందుకే ప్రేక్షకుల కంత మోజు. 'హెమింగ్ వే' యీ రకం తన్నుకునే, గుద్దుకునే కథలు వ్రాశాడు—ఆ రచనలు వుత్తమ సాహిత్యం అంటున్నారు. లారెన్సు నవలలో నాయికానాయకులు తిట్టుకుంటారు, తన్నుకుంటారు, హింసించుకుంటారు. రక్తంతో వినోదిస్తారు. లారెన్సును, సారస్వత గురువుగా పూజిస్తున్నారు. మన దేశంలో వీటికి స్థానంలేదు....ఇక్కడంతా శాంతి, మృదుత్వం, దయ, క్షమ, ఔదార్యం, భక్తి, పాతివ్రత్యం, త్యాగం, మొదలైన విలువలు, యీ ప్రాచీన శక్తుల భేతాళనృత్యానికి తయారు చేసిన వేదిక; కూలిపోకుండా వుంటుందా?

చిన్న బండలని, బలంఅంతా వుపయోగించి, వర్మ వరసగా తోసేశాడు. అవి వెళ్ళి ఆ పెద్ద బండలు మూడింటినీ కదిపాయి. అన్నీ కలిసి కిందకి నదిలోకి శబ్దం చేస్తూ పడ్డాయి. రెండు మాత్రం వొంతెన మొగిలోపడి నాలుగైదు గజాలమేర వొంతెన కర్రలని కూల్చి వేశాయి. ప్రకృతి హృదయం పగిలినట్లు, పెద్ద శబ్దం. మరుక్షణం ప్రకృతి ఆశ్చర్యంతో వూపిరి బిగపెట్టినట్లు నిశ్శబ్దం.

ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుని వొక స్త్రీ కంఠం వినబడింది. మూనా పాడుతున్న వికృతమైన, విషాద కంఠం అది. ముచ్చెమట్లు పోసేశాయి. అగ్గిపుల్లని నోట్లో పెట్టుకుని, సిగరెట్టుని అగ్గి పుల్లగా రాస్తున్నాడు. ఆ కంఠం వల్లకాటిలో వేసిన కేక ప్రతిధ్వనిలా ధ్వనించింది. తనని రమ్మంటోంది. వెదుకుతున్నాడు. దిగుతున్నాడు. కిందికి—యింకా కిందికి.

ఆ కంఠంవైపు దిగుతున్నాడు. పాట దగ్గర కొచ్చింది. ఎదురుగా మూనా. గడ్డిపూలు రెండు చేతులకూ గాజులుగా అమర్చింది—ఎర్రపూలు చిక్కు జుట్టులో బిగించింది. ఎర్రటి పరికిణినిండా, చిరుగులు, అతుకులు. నవ్వింది.

వర్మ సిగరెట్ పైకి తీశాడు. నీళ్లల్లో కాళ్లు పెట్టి వొడ్డున కూర్చుంది. ఏదో అంటోంది. నీళ్లల్లోకి రమ్మనాకి నీళ్లు బురదగా, వడిగా వున్నాయి. అతను దిగదల్చుకోలేదు. సిగరెట్టు ముట్టించాడు. అతను వొదిలిన పొగను, తను వూదుతూ పిలుస్తోంది. పర్సులోంచి పది రూపాయలనోటు తీశాడు. ఆమె కళ్లు సంతోషంతో మెరిశాయి. దగ్గరగా చూడ్డానికి వొంగింది. బుజంమీది నుండి జారి నప్పుడు సంధ్య వెలుగులో రొమ్ముల నీడలు సుంద్రంగా రాతి బండ మీద పడుతున్నాయి. రెండు చేతులూ ఆమె బుజాన వుంచాడు. కిందికి జారుతున్న అతని వేళ్ళని తొలగించి, తన చేతులతో బిగించి అతన్ని లేవతీసింది. నోటు తీసుకుని పరికిణీలో మడిచింది.

వర్మకి ధైర్యం పెరిగింది—లేచాడు. ఆమె నడుస్తోంది—తనూ నడుస్తున్నాడు. పరుగెడుతోంది; తనూ పరుగెడుతున్నాడు. సంధ్య పడమటి ఆకాశంలో కరిగి, ఊదాగా మారుతోంది. నీడలు పడటంలేదు; సన్నటి చందమామ నీటిలో ప్రతిబింబించటంలేదు. చందమామ ప్రక్క వొక నక్షత్రం, పడమటి ఆకాశంలో మరో నక్షత్రం కనబడుతున్నాయి.

వొంతెన దగ్గర కొచ్చేశారు. ఆమె వొంతెన మీదకు నడిచింది. అతన్ని రమ్మంది. వొచ్చాడు. కింది నీటి వడికి తన తల తిరుగుతోంది. అతన్ని పట్టుకుంది. మెడచుట్టూ చేతులువేసి దగ్గరకు లాక్కుని, బుగ్గలు, గడ్డం, గిల్లుతూ, లోతుగా కళ్ళల్లోకిచూసి విరగబడి నవ్వింది. ఏదో అంటోంది. వర్మ శరీరం పట్టు తప్పి, ఉద్రేకంతో వూగిపోతోంది. ఆమెను గట్టిగా కౌగలించుకున్నాడు. అతని పెదవులు ఆమె మొహాన్ని తడుముతున్నాయి. గుండెమీద గుప్పిడి బిగించి, వొక్క వూపుతో ముందుకు తోసేసింది. వర్మ నీళ్ళలోపడి కొట్టుకుపోతున్నాడు.

కేకలు వేస్తూ, మునుగుతూ, తేల్తూ, చెయ్యి పైకి విసరివేస్తూ కొట్టుకు పోతున్నాడు. కేకలు తగ్గాయి. నీళ్లు మింగుతూ శబ్దాలు చేస్తున్నాడు. పదడుగులు, పదిహేనడుగులు, ఇరవై—వెళ్ళి పోతున్నాడు. వొడ్డునున్న ఏదో రాతిబండ కాసేపు కాలికి తగిలి నిలబడినా, పట్టు దొరక్క మళ్ళా కొట్టుకు పోతున్నాడు. ముప్పై నలభైఅడుగులు,—వెళ్లి పోతున్నాడు. చేతులు నీళ్లపైకి రావడం తగ్గుతోంది. శబ్దం సన్నగిలుతోంది. నది మలుపులో, వొడ్డున సచ్చితానందం, చూశాడు. సైకిలు చెట్టున ఆనించి, లాల్చీ తీసేసి, డ్రాయర్ తో, చేతిలో టెలిస్కోప్ తో సహా, నీళ్లల్లోకి దూకేశాడు. టెలిస్కోప్ వర్మ చేతికి తగిలి, దాన్ని గట్టిగా రెండు చేతులతో పట్టుకున్నాడు. సచ్చితానందం టెలిస్కోప్ పట్టువొదలకుండా, వొక చేతితో వర్మమొహాన్ని పైకి నెట్టుతూ, వొడ్డుకి చేరవేశాడు.

సంధ్యకరిగి చీకటి అలుముకుంటోంది. వొడ్డున పడిన వర్మకి ప్రథమ చికిత్స చేశాడు. నీళ్లు తాగేసిన వర్మ నిస్త్రాణగా కళ్లు మూసుకుని పడుకున్నాడు. ఒడ్డున పొదల వెనక కీటకాలు చెలరేగాయి, అడివి కూసినట్లుగా. మందమైన ఆకులు రాలుతున్నాయి.

సచ్చితానందం వొళ్లు క్షణంలో ఆరిపోయింది. వెనక్కి చూశాడు. మూనా దూరంగా నిలబడివుంది. ఆమె కేసి నడిచాడు. అతని విడిచిన దుస్తులు ఆమె దగ్గరున్నాయి. ఒడ్డున కూర్చున్నాడు. మూనా తల తుడుస్తోంది. కణతలు నొక్కుతోంది. లంగా సర్దుకోడంలో, నోటు బైటపడింది. అతని కిచ్చింది. ఏదో మాట్లాడింది. అతను బట్టలు వేసుకున్నాడు. ఆమె సైకిల్ తీసుకొని నడుస్తోంది. అతను మెల్లగా నడుస్తూ టెలిస్కోప్ లోంచి చూస్తున్నాడు.

పశ్చిమ ఆకాశంలో ఎరుపు చిక్కనై నలుపైంది. 'వీనస్—' పెద్దగా మెరుస్తోంది. భూమి అంచు, నిశీధిముసుగులా కమ్ముకొంది. వర్మదగ్గరకి చేరుకున్నాడు. అతని పంట్లాం జేబులో పర్సుతీసి, అందులో నోటుపెట్టి, ఆ జేబులోనే వుంచాడు. మళ్లా నడుస్తున్నాడు. రోడ్డుమీదికి వొచ్చేశాడు. దూరంగా అతనికేసి వొక వేగన్ వొస్తోంది. సంజ్ఞలతో దాన్ని నిలిపాడు అందులోనుంచి సోమయ్యదిగాడు. అతని వెనకాల వర్మభార్య స్నేహలత దిగింది. చలికి కాబోలు ఆమె కొంగుని జుట్టుమీద, చెవులమీద కప్పుకుంది. ఆమెని అక్కడే వుండమని, సోమయ్యని, డ్రైవర్‌ని తీసుకుని వర్మదగ్గర కొచ్చాడు. ముగ్గురూ సాయంపట్టి, అతన్ని వేగన్‌లోకి చేరవేశారు. ధ్వనికి ప్రశాంతత మైలబడుతుందేమోనన్నట్లు, ఎవ్వరూ మాట్లాడడం లేదు. దూరంగా నది మూలుగు, కీటకాల రొద, శిఖరాలపై వికృతంగా బండలు, వాటిమధ్య 'వీనస్' వెలుగు— జబ్బుచేసిన పరమాత్మ అడుగులోయలో అడుగు పెట్టినట్లు, శూన్యం సజీవమైన క్షణాలు గడిచినాయి.

వేగన్‌లో చిన్నిదీపం వెలుగులో వర్మ కళ్ళు తెరిచాడు. చుట్టూ చూశాడు. భార్యమొహం చూసి నీరసంగా నవ్వాడు.

"అసలేం జరిగింది?" అని అడిగింది స్నేహలత, ఏ ఒకర్నీ సంబోధించకుండా. విశ్వంచేసిన కడసారి గానానికి ప్రతిలా ఆ కంఠం అసహజంగా వినబడింది.

వర్మ మాట్లాడబోయాడు. వద్దని సంజ్ఞచేసి, సచ్చిదానందం ఆ ప్రశ్నకి సమాధానం చెప్పాడు.

"ఏంలేదండీ— నేను సర్వే పూర్తిచేసుకుని, రోజూ లాగే, నదిమధ్యగా వొంగిన ఆచెట్టుకొమ్మమీదకూర్చుని, 'వీనస్' గ్రహం కనిపిస్తుందేమోనని టెలిస్కోప్‌లో చూస్తున్నాను. పట్టుజారి నీళ్ళల్లో పడిపోయ్యాను. ఒడ్డున వస్తున్న వర్మగారు నన్నుచూసి నీళ్లల్లోకి దూకి, ఇద్దరం వొడ్డుకి చేరడంలో నీళ్లు తాగేశారు."

వర్మ కళ్లు తెరిచి జాలిగా అతనికేసి చూశాడు. చెయ్యి పైకి తీసి అతని భుజంమీద వుంచాడు. యేదో మాట్లాడబోయ్యాడు. సోమయ్యకి దగ్గరగా రమ్మని సంజ్ఞచేసి, అతని చెవులో యేదో చెప్పాడు. "మీరు విశ్రాంతిగా పడుకోండి. ఒంతెన గురించి ఆదుర్దా పడకండి. ఆ పనికి మీరెందుకు. మేమందరం పూర్తి చేస్తాంగా" అన్నాడు సోమయ్య.

వేగన్ బంగళాకేసి నడుస్తోంది. స్నేహలత వీనస్‌కేసి చూసింది. తన భర్తకి యీదడం రాదనీ, నీళ్ళంటే భయమనీ ఆమెకుతప్ప ఎవ్వరికీ తెలియదు. ఈ రహస్యం ఎవ్వరితో చెప్పనులే అన్నట్లు 'వీనస్' శిఖరంవెనుక లోయలో, భూమి అంచువెనక దిగి అంతర్ధానమైంది. కూలిన శిఖరంగా అడుగులోయ చీకటి సౌందర్యం ముసుగులా పైకిలాక్కుని పడుంది.